క్లుప్తంగా

విద్యార్థులకు చేతిరాత పరీక్ష



మాట్లాడుతున్న లైబ్రేరియన్ సుగుణరావు, దేవపాలన

అద్దంకి రూరల్: విద్యార్థి దశలోనే చేతిరాత మెరుగు పరుచుకోవాలని రిటైర్డు ఆర్జేడీ యు. దేవపాలన అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థలకు చేతిరాత పరీక్షలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పాల్గొనగా విజేతలైన వారికి జ్యోతి చంద్రమౌళి బహుమతులు అందజేశారు. దీనిలో భాగంగా దేవపాలన 400 పుస్తకాలు పెట్టేకునేందుకు స్టీల్ ర్యాక్‌ను గ్రంథాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సుగుణరావు, సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వీర్రాజు, హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ జీ. రమేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

పర్చూరు (చినగంజాం): పూసపాడు గ్రామానికి చెందిన నిమానూరు మధుకుమార్, శ్రీలత కుమార్తె లేటు లతీక్‌శ్రీ గుప్త పుట్టినరోజు పురస్కరించుకొని ఆమె జ్ఞాపకార్థం ఆదివారం పర్చూరులోని భవానీ మహిళా మండలి ఆశ్రమంలో 25 మంది వృద్ధులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. వృద్ధులకు సహాయం చేయడం ఆనందంగా ఉందని దాతలు అన్నారు. కార్యక్రమంలో పున్నారావు, కృష్ణకుమారి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ



బల్లికురవ: ప్రతి రోజు ఏదో ఒక గ్రామంలో పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీకి గురవుతోంది. శుక్రవారం అర్ధరాత్రి చెన్నుపల్లి రోడ్డులోని మొవ్వా అంజయ్యకి చెందిన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు కిందకు దించి రాగివైరు చోరీకి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం వల్లాపల్లి గ్రామ సమీపంలో పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ రాగివైరు చోరీకి గురైంది. వరసగా చోరీలు జరుగుతున్న దొంగతనాలకు అడ్డుకట్ట పడకపోవటంతో ఎలా రక్షించుకోవాలో అంతుచిక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్న ఎస్సై

అద్దంకి రూరల్: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడతామని అద్దంకి ఎస్సై ఖాదర్‌బాషా పేర్కొన్నారు. అద్దంకి పట్టణంలో ఆదివారం రాత్రి స్థానిక భవాని సెంటర్‌లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు.


పేపర్ మిల్లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షుడు రామకోటేశ్వరరావు

బల్లికురవ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుబాబుల్ సాగు విస్తర్ణం ఎక్కువ సాగు చేస్తున్నందున పేపర్ మిల్లు ఏర్పాటు చేయాలని రైతు సంఘం అధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం బల్లికురవలో రైతులతో ఆయన మాట్లడారు. ప్రభుత్వం ఎరువుల కొరత లేకుండా సకాలంలో రైతు సేవా కేంద్రాలకు చేర్చటంతో పాటు కల్తీ ఎరువులకు చెక్ పెట్టాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారే తప్ప పంట రుణాలు అందించటంలో శ్రద్ధ చూపటం లేదన్నారు. కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద రుణాలు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారన్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కకపోవడంతో అవస్థలు పడుతున్నారని వాపోయారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలో సుబాబుల్ సాగు విస్తీర్ణం పెరిగిందని, ఈప్రాంతంలో పేపర్ మిల్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పొగ తక్కువ.. పోగేసేది ఎక్కువ?



- ఫాగింగ్‌లో కనిపించని ప్రమాణాలు ?
- పనికిరాని రసాయనాలు కలుపుతున్న వైనం
- డీజిల్ కోసం లక్షల్లో ఖర్చు
- అధిక బిల్లులు పెట్టి జేబులు నింపుకుంటున్న మున్సిపాలిటీ అధికారులు

చీరాల: మున్సిపాలిటీల్లో ఫాగింగ్ పేరుతో అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారు. మలాథియాన్, డెగ్‌ఫాగ్, డీజిల్ మరికొన్ని రసాయనాలు కలిపి ఫాగింగ్ చేస్తే దోమల నివారణ సాధ్యపడుతుంది. ప్రస్తుతం ఈ సీజన్‌లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో జనాభా అధిక సంఖ్యలో అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో జ్వరబాధితులు ఎక్కువగా ఉన్నారు. ఫాగింగ్ చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారులు మాత్రం ఇదేమని అడిగితే దోమలకు ఇమ్యూనిటీ పవర్ పెరిగిందని చెప్పడం చోద్యంగా ఉంది. పట్టణంలోని శివారు ప్రాంతాలలో దోమల బెడద ఎక్కువగా ఉంది. పంట పొలాలు, మురుగు కాలువలు ఎక్కువగా ఉండడంతో పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమ కాటుతో చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ జ్వరాల బారిన పడ్డారు. పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో జ్వరాలతో బెడ్లన్నీ ఫుల్ అయ్యాయి. అయితే దోమల ఉధృతిని తగ్గించేందుకు మున్సిపాలిటీలో ఫాగింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. ఏటా ఫాగింగ్ యంత్రాలలో వాడే రసాయనాల కోసం లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. లక్షల్లో ఖర్చు కనిపిస్తున్నా జ్వర బాధితులు మాత్రం తగ్గడం లేదు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో మంచాన పడుతున్నారు.

ఇం'ధనం' లెక్కేది.. ?

చీరాల మున్సిపాలిటీలో మొత్తం 33 వార్డులున్నాయి. వీటిలో 12 వార్డులు శివారులో లోతట్టు ప్రాంతాలు ఉన్నాయి. వార్డుల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. దోమలు నివారణకు మున్సిపాలిటీ లక్ష రూపాయలు పైగా ఖర్చు పెట్టి పెద్ద మిషన్‌ను కొనుగోలు చేశారు. అలానే మున్సిపాలిటిలోని ఆరు క్లస్టర్లకు ఆరు ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. వీటిని కరోనా సమయంలో ఐటీసీ మున్సిపాలిటీకి ఇచ్చారు. వీటితోనే వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. పెద్ద మిషన్ ద్వారా ఫాగింగ్ చేయాలంటే రోజుకు 70 లీటర్ల వరకు డీజిల్ అవసరమతుంది. చిన్న మిషన్ల ద్వారా వార్డుకు ఫాగింగ్ చేయాలంటే రూ.7 వేల వరకు ఖర్చు అవుతుంది. వీటిలో కలిపే మలాథియాన్, రసాయనాలు తక్కువ ఖర్చు అవుతుంది. డీజిల్‌కే ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుంది. దోమలు నివారణకు పొగ పెడుతున్నా దోమల వ్యాప్తి మాత్రం ఆగడం లేదు. పొగ మాత్రం దట్టంగా వస్తున్నా ఫలితం లేకుండా పోతుంది. రాత్రి వేళల్లో ఫాగింగ్ కూడా తూతూ మంత్రంగానే చేస్తున్నారు. పొగ వేసేది తక్కువ పోగేసేది ఎక్కువ అన్నట్లుగా మున్సిపల్ శానిటరీ విభాగం తీరుగా కనిపిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎక్కడ చూసినా జ్వరపీడితులే..

సంవత్సరంలో వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. వర్షపునీరు నిలిచిపోయినా, కాలువల్లో మురుగునీరు పారుదల లేకుండా, అపరిశుభ్రంగా పరిసరాలు ఇలా అనేక కారణాలతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. దోమల నివారణకు మున్సిపాలిటి అధికారులు ఎక్కువగా మొత్తంలో వెచ్చించినా దోమ కాటును తప్పించలేక పోతున్నారు. దోమకాటు వలన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డెంగ్యూ బారిన పడి గతంలో శివారుప్రాంతంలోనే కొంత మంది మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం జ్వరాల బారిన పడిన వారు ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫాగింగ్ పూర్తి స్థాయిలో చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న కార్మికుడు

> **దోమల్లో ఇమ్యూనిటీ పెరిగింది..** డీజిల్, మలాథియాన్ కలిపినా ఫలితం లేకుండా పోతుంది. దోమలలో కూడా ఇమ్యూనిటీ ఎక్కువగా ఉంది. అందుకే ఫాగింగ్ చేస్తున్నా దోమల వ్యాప్తి తగ్గడం లేదు. విషజ్వరాలు ఎక్కువగా వస్తున్నాయి.
>
> – ప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, చీరాల

అవిశ్రాంత పోరాట యోధుడు సీతారాం



మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

మార్టూరు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంత పోరాటం జరిపిన తెలుగు బిడ్డ సీతారాం ఏచూరికి మరణం లేదని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో మూడుసార్లు అధ్యక్షుడిగా పనిచేసినా, 12 సంవత్సరాలు పాటు రాజ్యసభ మెంబర్‌గా విధులు నిర్వహించి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచినా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, మానవ హక్కుల కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారని కృష్ణయ్య అన్నారు. ఈసందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ దాని అనుబంధ శాఖల నాయకులు సీహెచ్ మజుందార్, రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, రావుల బాపయ్య, వై రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యం దేవుడిచ్చిన వరం



వృద్ధులను సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సభ్యులు

చీరాల రూరల్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వృద్ధులను సంఘం ఆధ్వర్యంలో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణమూర్తి మాట్లాడారు. వృద్ధాప్యం దేవుడిచ్చిన వరమని, పుట్టిన ప్రతి ఒక్కరూ వృద్ధాప్యంలోనికి రాక తప్పదన్నారు. వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె. నాగవీరభద్రచారి, కట్టా రాజ్‌వినయ్ కుమార్, జి. హరిహరరావు కె. వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ప్రదర్శన



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మార్టూరు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ప్రపంచ శాంతి కోసం అన్ని దేశాలు కృషి చేయాలని సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జాగర్లమూడిలో లలితా త్రిపురసుందరీదేవిగా ఉజ్జయినీ మహంకాళీ..



వేటపాలెం కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో రాజరాజేశ్వరీదేవిగా..



చెన్నుపల్లిలో అలంకరణలో పార్వతిదేవి అమ్మవారు ..



నూతలపాడులో లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



కారంచేడు శివాలయంలో చండీదేవి అలంకరణలో..

వాత్సల్య రూపిణీ.. లలితా త్రిపురసుందరీ దేవి

- నాలుగో రోజు లలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు
- ఆలయాల్లో పూజలు చేసిన మహిళలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యద్దనపూడి/కారంచేడు/మార్టూరు/చినగంజాం: దసరా శరన్నవరాత్రుల్లో నాలుగో రోజు అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో ఒకవైపు లక్ష్మీదేవి, మరో వైపు సరస్వతిదేవి వింజామరలు వీస్తూండగా చల్లని చిరునవ్వుతో భక్తులను అనుగ్రహించే ఆదిదేవతగా భక్తులను అనుగ్రహించారు. త్రిమూర్తుల కన్నా ఆదిదేవతైన త్రిపురసుందరీ అమ్మవారు పంచ దశాక్షరీ మహామంత్రానికి అధిదేవతగా, శ్రీచక్ర అధిష్టాన దేవతగా ఉన్న అమ్మవారిని కొలిచిన భక్తులకు సకల ఈతిబాధలు తొలిగిపోతాయని భక్తుల విశ్వాసం. మండలంలోని జాగర్లమూడి ఉజ్జయినీ మహంకాళీ, పూనూరు త్రిపురసుందరీదేవి, నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు, గన్నవరం కాశీ అన్నపూర్ణాదేవి ఆలయాల్లో అమ్మవార్లకు కుంకుమార్చనలు, అభిషేకాలు, లలితా సహస్రనామ పారాయణలు, శ్రీచక్రపూజలు నిర్వహించారు.

★ పర్చూరు మండలంలోని నూతలపాడులో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల 12వ వార్షికోత్సవం సందర్భంగా లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. రాత్రి సీతారామాంజనేయ సంకీర్తన బృందం కొల్లిమర్ల భజన సమాజంచే సంకీర్తన కార్యక్రమాన్ని హరిదాసుల శ్రీనివాసరావు నిర్వహించారు.

★ కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వేణుగోపాల స్వామి గుడి, పెదబజారు శివాలయం, వెంకటేశ్వరస్వామి వారి గుడి, సాయి మందిరం, కట్టమల్లేశ్వరస్వామివారి గుడి, స్వర్ణ వెంకటేశ్వర స్వామివారి ఆలయం, గంగమ్మగుడి, శివాలయం, వల్లభరాయస్వామివారి ఆలయం, తిమిడెదపాడు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోనూ అమ్మవారిని చండీదేవిగా ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు.

★ చినగంజాం మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసియున్న లలితా పరమేశ్వరీ రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు లలితా పరమేశ్వరీదేవి అవతారంలో కొలువుదీరారు. గ్రామానికి చెందిన ధర్మవరపు ఏసునారాయణ దంపతులు ఉభయదాతలుగా పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా ఆలయ పూజారి శంకరమంచి హనుమంతరావు పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చినగంజాం వాసవీ కన్యకాపరమేశ్వరీ మందిరంలో రైల్వేస్టేషన్ సెంటర్ విజయకనకదుర్గ ఆలయలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు.

హిమవంతినిదేవి అలంకరణలో అమ్మవారు..

అద్దంకి రూరల్/మేదరమెట్ల/జే.పంగులూరు/బల్లికురవ: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలోని అమ్మవారిని హిమవంతినిదేవిగా, ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారిని మీనాక్షి దేవిగా అలంకరించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద 540 మంది మహిళా భక్తులచే అలితా సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

★ బల్లికురవ మండంలంలోని చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన, చినఅంబడిపూడి, కొప్పరపాడు గ్రామాల్లో ఉదయం విశిష్ట పూజలు రాత్రికి భజనలు చేపడుతున్నారు.

★ కొరిశపాడు మండలం మేదరమెట్ల మిద్దెలడొంక రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారిని లలితా త్రిపురసుందరీదేవి అలంకారంతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కారంచేడులో అన్నపూర్ణదేవిగా అమ్మవారు



సోపిరాలలో లలితా పరమేశ్వరీగా అమ్మవారి దర్శనం



అద్దంకిలో హిమవంతినిదేవి అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి



మేదరమెట్ల మిద్దెలడొంకరోడ్డులో లలితా త్రిపురసుందరీదేవి..



అద్దంకిలోని దత్తపాదుకా క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బియ్యం బస్తాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వాహనం

మేదరమెట్ల: పేదవాడికి అందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కుల ఆగడాలతో పక్కదారిపడుతున్నాయి. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం దైవాలరావూరు రోడ్డులో అక్రమంగా ఆటోలో ఆదివారం ఉదయం తరలిస్తున్న వారిని మేదరమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో మేదరమెట్ల ఎస్‌ఐ షేక్ మహ్మద్ రఫీ తన సిబ్బందితో దాడిచేసి 22 బస్తాల (50 కేజీల)గల రేషన్ బియ్యాన్ని, ఆటోను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ నాల శ్రీకరుణను విచారించగా మేదరమెట్ల గ్రామానికి చెందిన ఇడపలపాటి శ్రీనివాస్ వద్ద నుంచి అద్దంకిలోని ఒబ్బినీడి వీరాంజి వద్దకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియచేశారు.

ఆటల పోటీల్లో ఉపాధ్యాయుల జయకేతనం



బహుమతులు అందుకుంటున్న ఉపాధ్యాయులు

మార్టూరు: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు తమ సత్తా చాటారు. క్యారమ్స్ డబుల్స్‌లో ప్రథమ స్థానాన్ని ఏ ప్రశాంత్, షేక్ జిలానీలు కైవసం చేసుకోగా జావెలిన్ త్రోలో రాష్ట్రస్థాయి తృతీయ బహుమతిని కే జాకబ్ గెలుచుకున్నారు. బాపట్ల జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి విజేతలైన ముగ్గురు ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా విజేతలైన ఉపాధ్యాయులను జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, మండల కమిటీ నాయకులు తదితరులు అభినందించారు.

మాజీ మంత్రి నాగార్జునను కలిసిన నాయకులు



మేరుగ నాగార్జునకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పర్చూరు (చినగంజాం): జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జునను పర్చూరు వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం కలిసారు, గుంటూరులోని ఆయన స్వగృహంలో కలిసి నియోజక వర్గ సమస్యలపై చర్చించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏదుబాడు గ్రామంలో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు వేసిన శిలఫలకాన్ని ఇటీవల కొందరు ధ్వంసం చేసిన విషయాన్ని ఆయనతో చర్చించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో గుంటూరులోనే ఉన్న మరో వైఎస్సార్ సీపీ నాయకులు, నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మోదుగుల వేణుగోపాల రెడ్డిని కూడా కలిసి కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. ఆయనను కలిసిన వారిలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్టా రత్నరాజు, చినగంజాం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాదర్తి ప్రకాష్, నాయకులు కూరాకుల ఇస్సాక్, బండి రాంబాబు, కోమట్ల శివరామరెడ్డి తదితరులున్నారు.